ఏరియా ఆస్పత్రిలో తగ్గిన ప్రసవాలు

- నలుగురు గైనకాలజిస్టులు ఉన్నా.. డెలివరీలు అంతంతే
- జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్న వైద్యులు
- ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న గర్భిణులు


మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి


తనిఖీ సమయంలో వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ అర్బన్ : ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలందించాలని ప్రభుత్వం, వైద్యశాఖాధికారులు చెప్తున్నా క్షేత్ర స్థాయిలో ఆచరణ కావడం లేదు. అత్యవసర వైద్యం అవసరం ఉండి ఏరియా ఆస్పత్రికి వచ్చే వారిని పై ఆస్పత్రులకు వెళ్లాలంటూ.. రిఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారు ఏరియా ఆస్పత్రి వైద్యులు. మిర్యాలగూడ డివిజన్‌లో అతిపెద్ద వంద పడకల ఆస్పత్రిగా పేరుగాంచిన ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు ప్రసవ వేదన తప్పడం లేదు.

ఎక్కువగా రిఫర్ కేసులే..

ఏరియా ఆస్పత్రికి వచ్చే కేసుల్లో దాదాపు చాలావరకు కేసులను నల్లగొండకు రిఫర్ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. నెలలు నిండిన గర్భిణులు ఆస్పత్రికి వస్తే వైద్యం అందించాల్సిన డాక్టర్లు ఏదో సాకు చూపి కాన్పులు చేయకుండా రిఫర్‌చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏరియా ఆస్పత్రిలో నలుగురు గైనకాలజిస్టులు ఉన్నా.. నెలకు 80కి మించి డెలివరీలు కాకపోవడం విస్మయానికి గురి చేస్తుంది. అదే విధంగా మిర్యాలగూడ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఒక్క గైనకాలజిస్టు ఉన్న వారి వద్ద నెలకు తక్కువలో తక్కువగా వందకు పైగా డెలివరీలు చేస్తున్నారంటే ప్రభుత్వ వైద్యుల పనితీరును అర్థం చేసుకోవచ్చు.

తనిఖీ సమయంలో కలెక్టర్ ఆగ్రహం..

ఏరియా ఆస్పత్రిలో వంద పడకల ఆస్పత్రిగా ఉండి నలుగురు గైనకాలజిస్టులు ఉన్నా.. డెలివరీల సంఖ్య పెరగక పోవడంపై ఇటీవల తనిఖీకి వచ్చిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం ఎందుకు కాన్పులు తగ్గాయని వారిని ప్రశ్నించడంతో పొంతన లేని సమాధానం చెప్పడం కలెక్టర్‌కు ఆగ్రహం తెప్పించింది. ఆస్పత్రికి వచ్చిన డెలివరీ కేసులను చిన్నచిన్న కారణాలు చూపి రిఫర్ ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించి ఆస్పత్రిలో డెలివరీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు.

రెండేళ్లలో జనవరి నుండి డిసెంబర్ వరకు ఏరియా ఆస్పత్రిలో డెలివరీల సంఖ్య

	2023	2024
జనవరి	106	107
ఫిబ్రవరి	98	74
మార్చి	15	40
ఏప్రిల్	64	98
మే	67	87
జూన్	120	94
జూలై	132	110
ఆగస్టు	122	104
సెప్టెంబర్	131	127
అక్టోబర్	123	121
నవంబర్	121	112
డిసెంబర్	131	95

డెలివరీల సంఖ్య పెంపునకు కృషి



ఏరియా ఆస్పత్రిలో కాన్పుల సంఖ్య తగ్గిపోవడం నిజమే. ఆస్పత్రిలో నలుగురు గైనకాలజిస్టు వైద్యులు అందుబాటులో ఉన్నారు. వారితో చర్చించి ఆస్పత్రికి వచ్చిన ప్రతి గర్భిణీకి స్థానికంగానే కాన్పులు చేసేలా చూస్తాం. వైద్యులతో మాట్లాడి ఆస్పత్రిలో డెలివరీల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తా.

– డాక్టర్ శ్రీనివాస సమరథ్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

వైద్యుల వైఫల్యం కనిపిస్తుంది



ప్రభుత్వ వైద్యం పేదలకు అందని ద్రాక్షగా మారింది. డివిజన్‌లో పెద్దదైన ఏరియా ఆస్పత్రిలో కాన్పులు తగ్గడం.. అదే విధంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో పెరగడం వెనుక ప్రభుత్వ వైద్యుల వైఫల్యం కనిపిస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే సజావుగా కాన్పు చేస్తారనే నమ్మకం ప్రజల్లో కల్పించాల్సి వైద్యులు చిన్న చిన్న కారణాలతో డెలివరీ చేయలేమని చెప్పి రిఫర్ చేస్తుందన్నారు. దీంతో భయపడి గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పేదలకు వేలకు వేలు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. జిల్లా అధికారులు స్పదించి అన్ని రకాల వైద్యం అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలి.

– పోలేబోయిన వరలక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు. శనివారం దేవరకొండ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల నమునా పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా సొంత స్థలం ఉన్న వారి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు రూ.5లక్షలు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్లు ఆయన తెలిపారు. లబ్ధిదారుల జాబితాను ముందుగా గ్రామసభలో ప్రదర్శించాక సమీక్షించి ఆ తర్వాతే అధికారులు ఎంపిక ప్రక్రియ చేపడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డానియల్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, డీఈలు రామనర్సింహారెడ్డి, నగేష్, నాయకులు మారుపాకుల సురేష్‌గౌడ్, వడ్త్య దేవేందర్, పున్న వెంకటేశ్వర్లు, కొర్ర రాంసింగ్, కిన్నెర హరికృష్ణ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

దేవరకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మున్సిపాల్టీ అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పట్టణంలోని ఆయా కాలనీల్లో గత పదేళ్లుగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్ల నిర్మాణానికి సంబంధించి నిధులు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలోనే ఖిల్లా ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, కమిషనర్ సుదర్శన్, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని వినతి


సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన రైతులు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూములు కోల్పోయిన నిరుపేద గిరిజన రైతులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని శనివారం దామరచర్ల మండలంలోని వీర్లపాలెం, దుబ్బతండా, సాత్‌తండా గ్రామాలకు చెందిన రైతులు సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌ను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు బాలునాయక్, చందు, రాముడులు మాట్లాడుతూ తమ తాతల తండ్రుల నుంచి భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, 2006, 2007లో గత ప్రభుత్వం ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చారని, పవర్‌ప్లాంట్‌లో భుములు కోల్పోయిన తమకు ఉపాధి అవకాశాలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం స్పందించి తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటేశ్వర్లు, సైదానాయక్, మానియా, గోవింద్, సైదా, గోపినాయక్, తావు, పాండు, సైదా, హనుమంతు, అంగోతు శ్రీనునాయక్, శంకర్, కృష్ణ, గోవింద్, నాగునాయక్, సేవా, మునినాయక్ పాల్గొన్నారు.

రూ.300 వేతనం అందేలా పని చేయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

మిర్యాలగూడ : ప్రతి ఉపాధి హామీ కూలీకి రూ.300 వేతనం వచ్చే విధంగా కొలతలు ఇచ్చి పనిచేయించాలని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రోజుకు 5నుంచి 6గంటలు కూలీలు పనిచేసే విధంగా చూడాలని, రోజుకు వర్క్‌సైట్‌లో రెండు సార్లు ఫొటో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో జనవరి నెలలో 25మంది కూలీలు, ఫిబ్రవరి నెలలో 50మంది, మార్చి నెలలో 80 మంది కూలీలు పనిచేసేలా చూడాలన్నారు. అన్ని గ్రామపంచాయతీల్లోని నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేయాలని, వేయి ఈత, తాటి నారు పెంచాలన్నారు. కమ్యూనిటీ ప్లాంటేషన్ 20శాతం, అవెన్యూ ప్లాంటేషన్ 20శాతం, బండ్ ప్లాంటేషన్ 20శాతం, ఈత, తాటి ప్లాంటేషన్ పదిశాతం, తుమ్మ 5శాతం, పెరటి మొక్కల పెంపకం 15శాతం, బయోఫెన్సింగ్ పదిశాతం ఉండేవిధంగా పెంచాలన్నారు. విధులపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అడిషన్ పీడీ నవీన్‌కుమార్, ఏపీడీ బాలకృష్ణ, చారి, ఉపాధిహామి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ


హాలియా : టీఎస్ పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా : పీఆర్‌టీయూ టీఎస్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విలువలతో కూడిన గుణాత్మకమైన విద్యను అందించడంలో పీఆర్‌టీయూ టీఎస్ పాత్ర ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, పెద్దవూర ఎంఈఓ తరి రాము, పీఆర్‌టీయూ సంఘం బాధ్యులు మధు, చెన్ను వెంకట్‌రెడ్డి, వీరారెడ్డి, మహేష్ గౌడ్, శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దవూర : పీఆర్‌టీయూ టీఎస్ పెద్దవూర మండల శాఖ క్యాలెండర్‌ను శనివారం సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి పెద్దవూర మండల ఎంఈఓ తరి రాములు, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు దండ వీరారెడ్డి, శిగం మహేశ్, రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, చిన నారాయణ, వెంకట్రాములు, శ్రీనివాసులు, ఇరుమాది పాపిరెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి


వెంకటాద్రిపాలెం శివారులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ : గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ శివారులో పట్టణ పేదప్రజల కోసం నిర్మించిన 560 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను సీపీఎం బృందం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం పేదల కోసం నిర్మించిన ఇళ్లలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. గతంలో లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. లేదంటే కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేసైనా ఇవ్వాలన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలని కోరుతూ ఈనెల 6న మండల, జిల్లా కేంద్రాల్లోని అధికారులకు వినతిపత్రాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు బావండ్ల పాండు, ముడావత్ రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, రెమిడాల పరశురాములు, తిరుపతి రామ్మూర్తి, అంజాద్, గోవర్ధన, కోటిరెడ్డి, మల్లయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కొండమల్లేపల్లి : మండలంలోని చెన్నంనేనిపల్లి గేటు వద్ద శనివారం తెల్లవారుజామున పెద్దవూర నుంచి అశోక్ లేలాండ్ ట్రాలీ ఆటోలో తరలిస్తున్న 20క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు. పీడీఎస్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా : అనుముల మండలంలోని మధారిగూడెం గ్రామానికి చెందిన రిక్కల వాసుదేవారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఐదు రోజుల క్రితం మృతి చెందాడు. శనివారం హాలియా పట్టణంలోని బాధిత నివాసంలో నిర్వహించిన రిక్కల వాసుదేవరెడ్డి ఐదవ రోజు చిన్న దిన కర్మకు సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు రిక్కల వాసుదేవరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో హాలియా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చంద్రారెడ్డి, మాజీ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌనీ రాజా రమేష్ యాదవ్, నాయకులు పొదిల కృష్ణ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ అదనపు భవనం ప్రారంభం


తహసీల్దార్ కార్యాలయ అదనపు భవనాన్ని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

మిర్యాలగూడ : మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయ అదనపు భవనాన్ని శనివారం తహసీల్దార్ ఎస్.హరిబాబుతో కలిసి మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ ప్రారంభించారు. భవన నిర్మాణ దాత గుడుగుంట్ల వెంకటయ్య స్మారకార్థం వారి కుమారులు గణేష్, సుబ్రహ్మణ్యం, అల్లుడు రఘు సహకారంతో నిర్మించారు. ప్రస్తుత పాత భవనం విశాలంగా లేకపోవడంతో ఛాంబర్, సమావేశ హాల్, కంప్యూటర్ రూమ్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ గదులు ఇరుకుగా ఉండేవి. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ మాట్లాడుతూ అధికారులు ప్రజలకు సత్వరమే సేవలు అందించాలన్నారు. భవన నిర్మాణానికి సహకరించిన వారికి తహసీల్దార్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దాతల కుటుంబసభ్యులకు, రైస్ మిల్లర్స్ ప్రతినిధులకు సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ హరిబాబులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఏఓ శ్రీనివాస్‌శర్మ, తహసీల్దార్లు జవహర్ లాల్, సురేష్, డీటీ కల్పన, ఆర్‌ఐలు రామకృష్ణ, సత్యనారాయణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కార్యదర్శి వెంకటరమణచౌదరి, గుడిపాటి నవీన్, రంగా శ్రీనివాస్, చిల్లంచర్ల శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో ఏకాగ్రత

నాగార్జునసాగర్ : క్రీడలతోనే విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని, మానసికోల్లాసం కలుగుతుందని తెలంగాణ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ మంగేష్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఏవీ పాఠశాలలో క్రీడా పోటీలకు జ్యోతిప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులకు క్రీడలను నేర్పించాలన్నారు. జట్టుగా, వ్యక్తిగతంగా ఆడే ఆటలను నేర్చుకోవాలని, దీంతో మానసిక దృఢత్వం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వాసుదేవ్ ఎస్‌ఈ రఘురాం, సివిల్ ఎస్‌ఈ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


క్రీడలను ప్రారంభిస్తున్న జెన్‌కో సీఈ మంగేశ్‌కుమార్

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం



అవగాహన కల్పిస్తున్న సీఐ జనార్దన్ గౌడ్

త్రిపురారం : ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని హాలియా సీఐ జనార్దన్ గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల కేంద్రానికి చెందిన దుకాణాదారులు వ్యాపారస్తులు గ్రామాల్లోని దుకాణాదారులకు సీసీ కెమెరాలపై ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ప్రతి వ్యాపార సముదాయాల్లో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దొంగతనాలు అరికట్టడంలో సీసీ కెమెరాలు పని చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం ఎస్‌ఐ వై ప్రసాద్ పోలీస్ సిబ్బంది, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం

మిర్యాలగూడ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక సెలవులు వినియోగించుకోకుండా విధులు నిర్వహించిన ఉపాధ్యాయులను శనివారం హెచ్‌ఎం ధర్మానాయక్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంవత్సరంలో పురుషులకు 22, స్త్రీలకు 27 సాధారణ సెలవులు ఉంటాయన్నారు. ఆ సెలవులను పాఠశాల ఉపాధ్యాయులు కొర్ర కృష్ణకాంత్‌నాయక్, అనితజ్యోతిలు పూర్తి స్థాయిలో వినియోగించు లేదని, విధుల్లో అంకిత భావంతో పనిచేస్తూ విద్యార్థులు అందుబాటులో ఉండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపేందర్, ముంతాజ్‌బేగం, చావుర్యా, సంతోష్, అనితజ్యోతి, ధనలక్ష్మీ, అశ్విని, స్పందన, వెంకటరమణరెడ్డి, రాణి, జ్యోతి, కరుణాకర్, కాంతయ్య, జానయ్య, జంగయ్య, స్వామి, మీనా, భవాని, సీమా, నస్రీన్, ధనమ్మ, పేరయ్య పాల్గొన్నారు.

30 ఏళ్ల భూ సమస్యకు పరిష్కారం

- ఆక్రమణదారుడి నుంచి ప్రభుత్వ భూమి స్వాధీనం
- హద్దులు, బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు


ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని కేతేపల్లి గ్రామంలో సర్వే నంబర్3 కేతేపల్లి గ్రామానికి చెందిన లచ్చిరాం అనే వ్యక్తి 30ఏళ్ల క్రితం ప్రభుత్వ స్థలాన్ని అక్రమంగా పట్టా చేయించుకొని మరొకరికి అమ్మడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా సదరు వ్యక్తి హై కోర్టును ఆశ్రయించాడు. అదే గ్రామానికి చెందిన మరికొందరు కోర్టును ఆశ్రయించడంతో 30ఏళ్లుగా ఈ అంశం కోర్టు పరిధిలో ఉంది. కాగా ఇటీవల తహసీల్దార్‌గా వచ్చిన శ్రీనివాసులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాడు. ఈ మేరకు కలెక్టర్ స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు ప్రభుత్వ భూమిని స్వాధీనపర్చుకోవడంతో పాటు శనివారం కడీలను ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలమని తెలుపుతూ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఎవరైన ఆక్రమించినా వారిపై క్రిమినల్‌చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. వారి వెంట ఆర్‌ఐ వంశీ, ట్రైనింగ్ ఎస్‌ఐ రాంరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం


దుకాణాలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

మిర్యాలగూడ టౌన్ : ప్లాస్టిక్ రహిత పట్టణంగా మిర్యాలగూడ పట్టణాన్ని తీర్చిదిద్దడానికి ప్రజలు అన్ని విధాలుగా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ కోరారు. శనివారం పట్టణంలోని శ్రీనివాస థియేటర్ వెనుక భాగంతో పాటు గణేశ్ మార్కెట్‌లో దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం 40మైక్రాన్లలోపు ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్‌ను అమ్ముతున్న ముగ్గురికి రూ.వేయి చొప్పున మరో ఇద్దరికీ రూ.500 చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్లాస్టిక్ అమ్మితే వారికి భారీ జరిమానాను విధించనున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వ్యాపారులు సహకరించి ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ వెంకన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, జాఫర్ అలీ, మున్సిపల్ జవాన్లు రాజేందర్, ప్రశాంత్, వీరయ్య, గురునాథ్, నాగరాజు, విజయ్, బి. శ్రీను, కె. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

మిర్యాలగూడ అర్బన్ : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఏఎస్‌ఐ తబిత అన్నారు. శనివారం పట్టణంలోని విజేత డిగ్రీ కళాశాలలో షీ టీం ఆధ్వర్యంలో సైబర్ క్రైం, సోషల్ మీడియా ప్రభావం వంటి అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అపరిచితుల ఫోన్ కాల్ ఎత్తవద్దని, లోన్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌లను ఎలా ఎదుర్కొవాలి అనే అంశాలపై సదస్సులో వివరించారు. తాత్కాలిక ఆనందాల కోసం చెడు వ్యసనాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కళాశాలలో యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులు వాటి బారిన పడకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తెల్ల ధనుంజయ, ఇతర అధ్యాపకులు, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దవూర : సమగ్రశిక్షా ఉద్యోగుల సమస్యల ను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు, జిల్లా అధ్యక్షుడు నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దవూరలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేజీబీవీల్లో ఉపాధ్యాయులంతా సమ్మెలో ఉండటంతో విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారన్నారు. సీఆర్‌పీలు లేకపోవడంతో విద్యావ్యవస్థలో సమాచారం చేరక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఖమ్మం పాటి శంకర్, రమావత్ లక్ష్మణ్‌నాయక్, రమేశ్, వెంకటేశ్, రవీందర్, జగదీశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

హాలియా : ఇంటర్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చదువుతున్న వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు లెక్చరర్లు కృషి చేయాలని డీఐఈఓ దస్రునాయక్ అన్నారు. శనివారం హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, ప్రయోగశాలలను పరిశీలించి మాట్లాడారు. కమిషనర్ ఆదేశాల ప్రకారం 90 రోజుల ప్రణాళికలో భాగంగా హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించినట్లు తెలిపారు. అనంతరం లెక్చరర్లతో డీఐఈఓ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హాలియా జూనియర్ కళాశాలలో ఓ లెక్చరర్ నకిలీ సర్టిఫికెట్లతో పని చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, ఆ లెక్చరర్ సర్టిఫికెట్లు నకిలీవో, కావో నిర్ధారించాలని, ఈ ఆరోపణల వలన కళాశాలలో పని చేసే లెక్చరర్లు అవమానాలకు గురికావాల్సి వస్తుందని దీనిపై నిగ్గు తేల్చాలని డీఐఈఓను కోరగా ఆయన లెక్చరర్లు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా దాటవేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ జాకీర్ హుస్సేన్, లెక్చరర్లు సంజీవరెడ్డి, హరికృష్ణ, వెంకటేశ్వర్ నాయక్, బాలరాజు, రోశయ్య, ఆదిరెడ్డి, సుజాత, మంగమ్మ ఉన్నారు.

పాఠశాలల్లోనూ గురుకుల మెనూ పాటించాలి

మిర్యాలగూడ టౌన్ : అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురుకుల మెనూ పాటించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు తలుపూరి కీర్తి, మిర్యాలగూడ నగర కార్యదర్శి బొల్లేపల్లి మధు మోహన్‌రాజు అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏబీవీపీ నాయకులు సందర్శించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులను ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర జాయింట్ సెక్రటరీ సిరి, ఉపాధ్యక్షులు కంభంపాటి అభిలాష్ తదితర నాయకులు పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమాలు ముఖ్యమే

త్రిపురారం : విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలూ ముఖ్యమేనని నిడమనూరు ఎంఈఓ లావూరి వెంకన్న నాయక్ అన్నారు. శనివారం నిడమనూరు మండలంలోని ముప్పారం ప్రాథమికోన్నత పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ వెంకన్న నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో ఉత్సహం పెరగడంతో పాటుగా పోటీతత్వం అలవరుతుందన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురారి శెట్టి రమేష్, శ్రీనివాస్, చైర్మన్ వెంకటమ్మ, ఉపాధ్యాయులు కోటయ్య, గోవర్ధన్, బొల్లెపల్లి వెంకన్న విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ముల్కలకాల్వలో పశు వైద్యశిబిరం

మిర్యాలగూడ : పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ముల్కలకాల్వలో శనివారం గోపాలమిత్ర పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ దుర్గారమాదేవి మాట్లాడుతూ వైద్య శిబిరంలో 52గేదెలకు పలు రకాల వ్యాధులను గుర్తించి వాటికి సంబంధించి వైద్యాన్ని అందించినట్లు తెలిపారు. అదేవిధంగా 33 దూడలకు నట్టల నివారణ మందులను తాపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌ఓ వెంకటేశ్వర్లు, వీఏ శ్రీకాంత్, వీఏ సుభానా, గోపాలమిత్ర సూపర్ వైజర్ శివా రెడ్డి, గోపాలమిత్రలు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, విజ యేందర్, శ్రీను, సందీప్, హరికృష్ణ, పాల్గొన్నారు.

నారుమడిపై గడ్డిమందు పిచికారీ


గడ్డిమందు చల్లడంతో ధ్వంసమైన నారు

మిర్యాలగూడ : పచ్చని నారుమడిపై గుర్తుతెలియని వ్యక్తి గడ్డి మందు పిచికారీ చేయడంతో సుమారు 50 ఎకరాల వరి నారు ధ్వంసమైంది. వివరాల్లోకి వెళ్తే మిర్యాలగూడ మండలంలోని తడకమళ్ల గ్రామానికి చెందిన సుంకిరెడ్డి సంజీవ్‌రెడ్డి యాసంగి పంట సాగులో భాగంగా 65 బస్తాల విత్తనాలు నారుమడిగా చల్లాడు. ఇటీవల నారు చేతికి రాగా పది ఎకరాల్లో నాటు వేశాడు. కూలీల వెసులుబాటును బట్టి మరో 50ఎకరాల్లో నాటు వేసేందుకు సిద్ధం అవుతుండగా శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ నారు మడిపై విషపూరీతమైన గడ్డి మందు పిచికారీ చేశారు. దీంతో 50 ఎకరాలకు సరిపడా నారు మొత్తం చచ్చుపడి నాటుకు పనికి రాకుండా పోయింది. సుమారు రూ.1లక్ష మేరకు ఆర్థిక నష్టం జరిగినట్లు బాధిత రైతు సంజీవ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై మిర్యాలగూడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ చేస్తున్నారు.